క్లుప్తంగా

వినుకొండ కమలదళాధిపతిగా సుధాకర్



వినుకొండ(నూజెండ్ల): పట్టణ భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా కోటా సుధాకర్ నియామకమయ్యారు. బుధవారం నరసరావుపేటలో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మధుకర్ సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. నూతనంగా ఎన్నికైన సుధాకర్‌ను జిల్లా అధ్యక్షులు శశికుమార్, పట్టణ మాజీ అధ్యక్షుడు నల్లూరి రాఘవులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి సత్కారం



నాదెండ్ల: గత ఇరవై రెండేళ్ళుగా భారతసైన్యంలో విధి నిర్వర్తించి రిటైర్మెంట్ తీసుకున్న జొన్నలగడ్డ కిరణ్‌కుమార్ సేవలు ఎనలేనివని లూథరన్ చర్చి ఫాస్టర్ మోహనరావు చెప్పారు. నాదెండ్ల చైతన్యనగర్ కాలనీలో బుధవారం కిరణ్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు, స్నేహితులు సత్కరించారు. దేశ భద్రతకై సరిహద్దుల్లో సాహసోపేతంగా పనిచేయటం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



శావల్యాపురం: ప్రతీ కుటుంబ సభ్యులు సమగ్ర వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ సహాయకులు, ఆరోగ్య కార్యకర్తలకు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలు పొందాలంటే కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన మ్యాపింగ్ ఈకేవైసీ డివైజ్‌తో మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. మిస్సింగ్ డేటాలో 12 రకాల అంశాలు పొందుపరిచి ఉంటాయన్నారు. అన్నీ శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో కె.రామారావు పాల్గొన్నారు.

కానుకల లెక్కింపు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ హుండీ లెక్కించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ సంయుక్త కమిషనర్, దేవదాయ శాఖ తిరుపతి వారు ఆదేశాలను సారము పల్నాడు జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఏవీ శ్రీనివాస్, ఇన్స్‌పెక్టర్ నరసరావుపేట కార్యనిర్వహణాధికారి కె. హనుమంతరావు, అర్చక స్వాములు వి. నరసింహాచార్యులు, ఎస్. శ్రావణకుమార్, ఆలయ ట్రస్ట్ అధ్యక్షులు రెడ్డి. బంగారయ్య, అచ్యుత. కృష్ణ సుబ్బారావు, కాళ్ళ. రామకోటేశ్వరరావు, మహాదేవ, జమున ఇందుమతి, భక్తుల సమక్షంలో ఈ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఒక సంవత్సరం ఏడు నెలలకు గాను హుండీ ఆదాయం రూ.5,39,430లు వచ్చాయని నిర్వాహకులు తెలిపారు.

డ్రైవర్లు దృష్టి లోపాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి



చిలకలూరిపేట: వాహన డ్రైవర్లు దృష్టి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కేవల్ రావు చెప్పారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా చౌదరయ్య హెల్త్ క్లబ్ ప్రాంగణంలో విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు నరసరావుపేటకు చెందిన రామలింగారెడ్డి మాక్స్‌విజన్ కంటి వైద్య శాల సహకారంతో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత పౌరులు ప్రయాణించే విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు ఎలాంటి దృష్టి లోపాలు లేకుండా చూడాలన్న ఉద్దేశంతో ఈ కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కూల్ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాక్స్‌విజన్ కంటి వైద్య శాల సిబ్బంది పాల్గొన్నారు.

వయసుకే విరమణ - సేవకు ఉదాహరణ

- పదవీ విరమణ జీవితాన్ని సేవలతో సుసంపన్నం చేసుకుంటున్న దంపతులు
- సేవా కార్యక్రమాలకు పింఛన్ డబ్బులు



అనాథలకు దుప్పట్లు, భోజనాలు అందిస్తున్న సువర్ణకుమారి



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న గంగయ్యచౌదరి

యడ్లపాడు: పెన్షన్ డబ్బులతో హాయిగా విశ్రాంతి జీవనం గడపాల్సిన వయసులోనూ, సమాజానికి మరింత ఎక్కువగా సేవ చేయాలనే తపన కలిగిన వ్యక్తులు ఆ దంపతులు. వారిద్దరూ రిటైరైన ఉద్యోగులు. వృద్ధులు. వారే 90 ఏళ్ల పోపూరి గంగయ్య చౌదరి, 65 ఏళ్ల నరేంద్ర సువర్ణ కుమారి. యడ్లపాడుకు చెందిన గంగయ్యచౌదరి ఎంఏ,ఎంఎల్ చదివారు. ఎండోమెంట్ శాఖలో డిప్యూటీ కమిషనర్‌గా, మాజీ సీఎం ఎన్టీఆర్, మాజీ మంత్రులు చేబ్రోలు హనుమయ్య, కోడెల శివప్రసాద్ వద్ద సహాయకుడిగా పనిచేశారు. ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగి అయిన ఆయనకు భార్య వెంకటభారతీ, ముగ్గురు సంతానం.

స్వర్ణ జీవన మార్గం

నరేంద్ర సువర్ణ కుమారి జీవితం కూడా ఒక స్ఫూర్తిదాయకం. కుటుంబ సభ్యులు భర్తతోడు లేకున్నా, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నా 65 ఏళ్ల వయస్సులోనూ తన పెన్షన్ డబ్బులతో సమాజ సేవలో మమేకం కావడం విశేషం. ఆ కార్యక్రమాలకు వరసకు సోదరుడు వై ప్రసాదరావును సహాయకుడిగా తీసుకుని ముందుకు సాగుతుంది.

భావితరాలకు సేవలు

90 ఏళ్ల వయసులోనూ కాస్తంత విశ్రాంతి తీసుకోకుండా, గ్రామంలో విద్యా విస్తరణ, యువతకు ఆంగ్ల భాషపై శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, గ్రామాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు. వచ్చే పెన్షన్ డబ్బుతో దంపతులిద్దరూ సాదాసీదా జీవనం గడుపుతున్నారు. అనారోగ్య సమస్యలను సవాలు చేస్తూ, ఓ ప్రైవేటు పాఠశాలలో బోధకుడిగా పని చేస్తూనే తన అనుభవాలను తదుపరి తరం యువతకు అందిస్తున్నారు. యడ్లపాడు గ్రామాభివృద్ధి కమిటీ ఏర్పాటుతోపాటు గ్రామంలో జరిగే సేవా, అభివృద్ధి కార్యక్రమాలు తన పింఛన్ డబ్బుల్ని అందిస్తూ ఆత్మ సంతృప్తి పొందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, లైబ్రరీ, వేసవి విజ్ఞాన కేంద్రాల్లో ఇంగ్లిష్‌ను ఉచితంగా బోధిస్తూ వారిలో భాషపై నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు.

నిరుపేదలకు ఆసరా

విజయవాడకు చెందిన సువర్ణకుమారి హెల్త్ ఎడ్యుకేటర్ వృత్తిలో తెలంగాణ రాష్ట్రంలోని, కామారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతాల్లో 36 ఏళ్ల విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ స్మితసబర్వాల్‌చే ఉత్తమ ఉద్యోగిని అవార్డును అందుకుంది. ఉద్యోగంలో ఉన్నప్పుడు కూడా మహిళా ఉద్యోగుల సమస్యలపై సాధనకు అక్కడి ప్రభుత్వంతో పోరాడారు. దీంతో ఉద్యోగ సంఘాలు ఆమెను మెడికల్ అండ్ హెల్త్ ఉమన్ ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా ఎంపిక చేశాయి. అటు ఉద్యోగం విధుల్లో, ఇటు మహిళా ఉద్యోగుల సమస్యల సాధనకు అంకిత భావంతో పనిచేసిన ఆమె 2019లో రిటైర్డ్ అయి ఆ తర్వాత మండలంలోని తిమ్మాపురంలో ఓ ఇంటిని నిర్మించుకుని అక్కడే ఉంటున్నారు.

కొద్దికాలం కిందట గుండె ఆపరేషన్ చేయించుకున్నా సువర్ణ, రిటైర్మెంట్ తర్వాత విశ్రాంతి తీసుకోక, తన పింఛన్ డబ్బుల్లో ప్రతినెలా క్రమం తప్పకుండా రూ.25 నుంచి రూ.35 వేల వరకు సేవలకే వెచ్చిస్తున్నారు. తనపేరుతోనే స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి సమాజమే తనకుటుంబంగా భావించి ఒంటరిగా జీవిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్య పరంగా అవగాహన సదస్సులు, పుస్తకాలు, దుస్తులు ఇవ్వడం, నిరుపేదలకు, అనారోగ్యం పాలైనవారు, అనాథలకు భోజనాలు, నగదు, దుస్తుల సాయం అందించడం ఆమె సేవా తపనకు నిదర్శనం.

సేవ కార్యక్రమాలతోనే ప్రశాంతత



యడ్లపాడు అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నా. వయసు మనసుకు సంబంధించినది, శరీరానికి కాదు. ఉన్నంత కాలం సేవ చేస్తూ తరించాలన్నది జీవితాశయం.

-పోపూరి గంగయ్యచౌదరి

జీవితం సార్థకమయ్యేలా..



సమాజం మనకు ఏమిచ్చిందనే ప్రశ్నకాకుండా మనం సమాజానికి ఏం చేశామన్నదే ముఖ్యం. కుటుంబ అభ్యున్నతికి కృషి చేయడంలో గొప్పేముంది. సమాజానికి సాయం చేయడంలోనే జీవితం సార్థకమవుతుంది. చరమాంకంలో నాశక్తి కొలది ఇతరులకు సాయపడేందుకు ప్రయత్నిస్తున్నా.

- నరేంద్ర సువర్ణకుమారి, తిమ్మాపురం

సుప్రీం జోక్యం చేసుకోవాలి

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై చేపట్టిన దమనకాండపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కోర్చోలి, తోడ్క గ్రామాల మధ్య ఈనెల ఒకటో తేదీ జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసన వ్యక్తంచేస్తూ వాల్‌పోస్టర్లు ప్రదర్శించారు. ఈసందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఈ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మృతి చెందారని, మరికొందరు మరణించే అవకాశం ఉందంటూ వార్తలు వచ్చాయన్నారు. జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌరహక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ చికినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈసీసీఈ డే కార్యక్రమం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బీ సెక్టార్‌లోని శ్రీనివాస నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఎర్లీచైల్డ్ హుడ్ అండ్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడుతూ ప్రతి పిల్లవాడు పుట్టినప్పటి నుంచి ఐదు సంవత్సరాల లోపు 85 శాతం బ్రెయిన్ డెవలప్‌మెంట్ జరుగుతుందని, ఈ వయసులో సమగ్ర అభివృద్ధి పిల్లలకు జరగాలని, పిల్లలు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలో జరిగే కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రైతులు, కార్మికులకు అన్యాయం

బడ్జెట్ ప్రతులను దహనం చేసిన రైతు, వామపక్ష నాయకులు



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న రైతు సంఘం, వామపక్షాల నాయకులు

నరసరావుపేట: రైతాంగానికి గిట్టుబాటు ధర చట్టం చేస్తానని, కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకొస్తామని చెప్పిన నరేంద్ర మోదీ ప్రభుత్వం వాటిని అమలు చేయకపోవడం, కనీసం వారిని ఆదుకునేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమైన చర్యని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ కార్మిక, కర్షక ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ కాపీలను దగ్ధం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బడ్జెట్‌లో కార్మికులు, కర్షకులను విస్మరించడం అన్యాయమని అన్నారు. ఈ బడ్జెట్ కార్మిక కర్షకులకు తీవ్ర నిరాశను కలిగించిందని, రైతులకు గిట్టుబాటు ధర చట్టాన్ని, కనీస మద్దతు ధరల చట్టాన్ని చేయాలని, కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల రైతులను వ్యవసాయానికి దూరం చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ చేసే విధంగా ఉన్నాయని అన్నారు. రైతాంగానికి అనుకూలంగా నిర్ణయాలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి డి.శివకుమారి మాట్లాడుతూ కార్మిక వర్గానికి నిధులు గతం కన్నా ఈ బడ్జెట్‌లో ఎక్కువగా కోతలు పెట్టారని, అసంఘటితరంగ కార్మికుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలను దివాలా తీయించే విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. ఈ బడ్జెట్‌లో కార్మిక వర్గానికి అనుకూలమైన విధానాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలు, రైతులు, కార్మికులు సంక్షేమ బడ్జెట్ అని చెబుతూ కార్పొరేట్ సంస్థలకు ప్రధానంగా అంబానీ, ఆదానీలకు ఉపయోగపడే విధంగా తన పార్టీకి ఎన్నికల బాండ్లు ఇచ్చేవారికి అనుకూలమైన బడ్జెట్‌గా రూపొందించారని అన్నారు. ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, సీపీఎం నాయకులు మస్తాన్‌వలి, సుభాష్ చంద్రబోస్, మస్తాన్‌రావు, మోహన్‌చంద్ పాల్గొన్నారు.

దుంగలు స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

- కాకానిలో అక్రమంగా చెట్లు నరికివేసిన టీడీపీ నాయకులు
- అడ్డుకున్న అటవీ అధికారులు
- దుంగలు స్వాధీనం

సాక్షి స్పందన



అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న దుంగలు

నరసరావుపేట రూరల్: మండలంలోని కాకానిలో అక్రమంగా చెట్ల నరికివేతను అటవీ శాఖ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. టీడీపీ నాయకుల బరితెగింపు పేరుతో సాక్షిలో చెట్ల నరికివేతపై కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఈ మేరకు అటవీ శాఖ సిబ్బంది చెరువు కట్టపై అక్రమంగా కూల్చివేసిన చెట్లను పరిశీలించారు. దాదాపు 15 చెట్లు వరకు నరికివేసినట్టు గుర్తించారు. ఆ ప్రాంతంలోని వేప, తుమ్మ దుంగలను స్వాధీనం చేసుకున్నారు. చెరువు కట్టపై ఉన్న దుంగల కొలతలను తీసుకున్నారు. దీనిపై జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ వివరణ కోరగా అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలంలోనే ఉన్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ కంచె తగిలి మిరప కోత కూలీ మృతి



మృతుడు కాలేశ్వరరావు

బొల్లాపల్లి: విద్యుదాఘాతంతో మిరప కోతకు వచ్చిన కూలీ మృతిచెందిన సంఘటన మండలంలోని గంగుపల్లి తండాలోని పొలంలో చోటు చేసుకుంది. బండ్లమోటు పోలీసుల కథనం ప్రకారం.. వినుకొండ మండలం ఎ. కొత్తపాలెంకు చెందిన తుపాకుల కాలేశ్వరరావు (30) మిరప కాయల కోతకు వచ్చి సమీప పొలానికి వేసి ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు. కాలేశ్వరరావు శావల్యాపురానికి చెందిన కొందరు కూలీలు గత 12 రోజుల క్రితం మండలంలోని గంగుపల్లితండాలో మిరపకాయల కోతకు వచ్చారు. పొలంలోనే గుడిసెలు వేసుకొని నివాసం ఉంటూ మిరపకాయల కోతకు వెళ్లారు. బుధవారం ఉదయం మిరపకాయలు ఆరబెట్టిన కల్లానికి వేసిన కంచె తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య లూర్థ్‌మేరి, నాలుగు నెలల పసిపాప ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నరసరావుపేట రూరల్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ప్రదీప్ కొత్తపల్లి తెలిపారు. జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జీపీ రాజు, ఏ ఎస్ఐ కె.మహేష్‌లు పాల్గొన్నారు.

ప్రకటనలు మాని కార్యాచరణ చూపాలి

చిలకలూరిపేట: నివేశన స్థలాలపై ప్రభుత్వం కేవలం ప్రకటనలు చేయడం సరికాదని, పంపిణీ చేసి చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ మారుతీవర ప్రసాద్ చెప్పారు. సీపీఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, నాయకులు తాళ్లూరి బాబురావు, షేక్ సుబాని, దాసరి వరహాలు, చెరుకుపలి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల పనిదినాలు కల్పించాలి



మస్టర్‌ను పరిశీలిస్తున్న పీడీ సిద్ధాలింగమూర్తి

శావల్యాపురం: జాబ్ కార్డు కల్గియున్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని జిల్లా నీటి యజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు మఠం సిద్ధాలింగమూర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రం శావల్యాపురం జాతీయ రహదారి వెంబడి జరుగుతున్న పంట కాల్వ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు కూలీలు చేస్తున్న పని ఆధారంగా వేతనాలు రూ.290 రూపాయలు తగ్గకుండా చూడాలన్నారు. జాబ్ కార్డు వారందరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఉపాధి పనులు పారదర్శకంగా జరిగేలా ఫీల్డ్ అసిస్టెంట్స్ బాధ్యత వహించాలన్నారు. కూలీల మాస్టర్ నమోదు కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు. రాబోయే రోజుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం మాస్టర్‌ను పరిశీలించి కూలీలతో మాట్లాడి పని ప్రదేశంలో ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు బీఎఫ్‌టీ లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ చెరుకూరి బాలకృష్ణ ఉన్నారు.

కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారు



నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): దేశవ్యాప్తంగా కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా కార్మిక సంఘాల రాష్ట్ర సమితి పిలుపు మేరకు పట్టణంలోని శివయ్య స్థూపం సెంటర్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు కొండ్రముట్ల సుభాని అధ్యక్షత వహించగా ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను అమలు చేయాలని, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నయా పైసా కేటాయించకుండా మోసం చేసిందన్నారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో షేక్ ఫిరోజ్, భాస్కర్, ప్రసాద్, రాయబారం వందనం, రామారావు, వెంకటేశ్వర్లు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి



బొల్లాపల్లి: బాలల హక్కుల పరిరక్షణకు సంబంధిత శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి తెలిపారు. బుధవారం మండలంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గంగులపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, మండల కేంద్రం బొల్లాపల్లిలో మోడల్ స్కూల్, కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రం, రేమిడిచర్ల, గుమ్మనంపాడు, హనుమాపురం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ నిర్వహించి పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పాఠశాలల నిర్వాహణ లేదని అన్నారు. గంగులపాలెం పాఠశాలలో రికార్డులకే పరిమితమైందని, స్టాక్ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట ఐసీడీఎస్ సీడీపీవో బి.అరుణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థినిలకు పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ, చదువులో వెనుకబడిన సి, డి గ్రేడ్ విద్యార్థినిలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్‌సీఈఆర్‌టీ స్టడీ మెటీరియల్ చాలా సులభతరంగా ఉందని తెలిపారు. మెటీరియల్‌లోని మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయటం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. పరీక్షలు మరో 42 రోజుల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రతి విద్యార్థిని శ్రద్ధగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయిని బి.నిర్మలాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. మండలంలోని పెదరెడ్డిపాలెం, జొన్నలగడ్డ గ్రామాల్లో బుధవారం ఏడీఏలు మస్తానమ్మ, ఎప్‌టీసీ డీడీఏ ఎం.శివకుమారి, వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించారు. క్షేత్రస్థాయిలో వివిధ పంటలను పరిశీలించారు. వరి పంటలో జింకు లోపం గమనించి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. చలామిన్ జింక్‌ను పంటపై పిచికారి చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. నత్రజనిని మోతాదుకు మించి వాడవద్దని తెలిపారు. ప్రస్తుతం పీఎం కిసాన్ లబ్ధి పొందే రైతులందరూ ఫామ్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. దీని కోసం గ్రామంలోని వ్యవసాయ సహాయకులను కలిసి నమోదు చేయించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర సేవలకు రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండండి

నరసరావుపేట: మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నానని ఎవరైనా ఫోన్‌చేస్తే వారి వివరాలు తీసుకోవాలని కమిషనర్ ఎం.జస్వంతరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫేక్ కాల్స్‌కు ఎవరూ రెస్పాండ్ కావాల్సిన పనిలేదని, పన్నులు చెల్లించాలని చెబితే మున్సిపల్ కార్యాలయంకు వచ్చి చెల్లిస్తానని చెప్పాలని కోరారు. ఎవరైనా ట్రేడ్‌లైసెన్స్, ఆస్తిపన్నులు, తాగునీటి కుళాయి పన్నులు చెల్లించాలంటే మున్సిపల్ కార్యాలయంకు నేరుగా వచ్చి చెల్లించవచ్చన్నారు. బయటి నుంచి వచ్చే ఫేక్ కాల్స్‌కు సమాధానం చెప్పాల్సిన పనిలేదన్నారు. మోసపూరిత కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు.

వృత్తి, నైపుణ్య శిక్షణ తరగతులు

చిలకలూరిపేటటౌన్: స్టెప్ (స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్), మేదరమెట్ల అంజమ్మ, మస్తానయ్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రికను పట్టణంలోని చైతన్య లిటిల్ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. వివరాలకు సీఆర్ కళాశాల, మామ్ కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ మానం శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్ రామారావు సెల్‌నం: 9030 616 331, 9704 266 214కు సంప్రదించాలన్నారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేటు వ్యవస్థలకు తొత్తు

శావల్యాపురం: కేంద్ర బడ్జెట్ అంబానీ, ఆదాని వంటి కార్పొరేటు వ్యవస్థలకు తొత్తుగా ఉందని మండల సీపీఎం కార్యదర్శి కనగాల వెంకట రామ మోహన్‌చందు అన్నారు. బుధవారం సాయంత్రం శావల్యాపురంలో సెంటరులోని అల్లూరిసీతారామరాజు విగ్రహం దగ్గర బడ్జెట్ పత్రులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గణపర్తి వెంకటేశ్వర్లు, బోయపాటి వెంకట రాయుడు, దుగ్గెంపూడి చిన్న వెంకయ్య, భువనగిరి వెంకటేశ్వర్లు, మందా జెన్నమ్మ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి కల్యాణ వెంకటేశ్వస్వామి ఆలయ వార్షికోత్సవాలు

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని రిజిస్టర్ కార్యాలయం సమీపాన ఉన్న పద్మావతి గోదా సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు ఈ సందర్భంగా బుధవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించే 'శ్రీనివాస కల్యాణం' పూజల్లో పాల్గొనే వారు ముందుగా రూ.116 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు శిక్షణ కార్యక్రమం

యడ్లపాడు: మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్థాయి అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హేమలతాదేవి చెప్పారు. గురు వారం ఉదయం 11 గంటలకు అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ, ఐటీసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.